# కోడెవయసు నాడు

హోటల్ గదిలోనుంచి బయటకు వస్తూంటే, ఆ చివరగా మూల గదిలోకి ప్రవేశిస్తూ కనిపించింది ఒక ఆకారం. ఒక నిమిషమో, ఒకటిన్నర నిమిషమో ముఖం అతని కళ్ల ముందు తారట్లాడింది. గది నెంబరు 225. ఆమె తనను చూడలేదు. ప్రత్యేకంగా గమనించలేదు-అని పరాత్పరరావుకు రూఢే. ఆమె కూడా తనను చూస్తే, తన మాదిరిగానే నివ్వెరపోయి తలుపు బయటే రాయిలా నిలబడి వుండేదా? ఇంతకూ ఆమె నిజంగా కుముదిని యేనా? - ఈ ప్రశ్నకు జవాబు కోసం పరాత్పరరావు తన మెదడంతా వెదుక్కుంటున్నాడు.

ఎప్పటి కుముదుని?

పదేళ్ల కిందటి మాట. ఆ మనిషిని తాను అప్పుడే మరచిపోయాడు. ఎప్పుడూ గుర్తుతెచ్చుకుందుకయినా ప్రయత్నం చేయలేదు. యీ కాల విరామంలో.

ఎందుకు గుర్తుతెచ్చుకొనడం? వేరే పనీ, పాట... యేమీ లేకపోయి కాకపోతే!

మనిషిని పోలిన మనుషులు వుండవచ్చు. పదేళ్ల క్రిందట తాను ఎరిగిన కుముదినికీ, యీ మనిషికీ కాస్త వ్యత్యాసం వున్నమాట నిజమే. శరీరం కాస్త 'లావు' చేసింది. చురుకుగా అడుగులు వేయడం లో యేం వ్యత్యాసం లేదు. ముఖంలో కొట్టవచ్చిన మార్పు యేమీ లేదు. అదే మామిడి పండు మార్కు బుగ్గలూ - పెదవులూ. దూరానికే ఆ మనిషిని పట్టి యివ్వడం పరాత్పరరావుకు ఆశ్చర్యంగా వుంది.

పది సంవత్సరాలలో మనుషులు యేమాత్రం గుర్తుపట్టటానికి వీల్లేకుండా మారిపోతారని అతని అభిప్రాయం. అయితే దానికి ఓ 'సవరణ' తీసుకురావలసిన అవసరం యిప్పుడు కలుగుతోంది. పరాత్పరరావు నేరుగా డైనింగ్ హాల్‌కు వెళ్లి కూర్చున్నాడు. తనకు కావలసిన భోజనానికి ఆర్డర్ యిచ్చేశాడు. కాని మనసంతా 'కుముదిని' ఆక్రమించుకు కూర్చుంది.

పరాత్పరరావుకి 'గతం'లో నివసించడం ఎంతమాత్రం యిష్టం లేదు. అతడు వర్తమానానికి సంబంధించిన మనిషి వెనకటి విచారాలు-మూటలుగా భుజాల మీద వేసుకు తిరగడం అతనికి సుతరామూ యిష్టం లేదు. అలాగే భవిష్యత్తును గురించి ఊహాపోహాలతో

ఈసులాడుకుంటూ కూర్చోడం కూడా అతని మనస్సుకు యెంత మాత్రం 'లాయకీ' అయన పని కాదు. 'ప్రస్తుతాన్ని' గురించే మనస్సు ఆలోచించాలి. అంతకంటె అవతలకు, ఇవతలకు వెళ్లవలసిన పని లేదు.

కుముదిని ఎవరు?

పదేళ్ల కిందట తన భార్య అంటే ప్రస్తుతంలో ఎక్స్-వైఫ్! పెద్దగా అభిరుచులలో వ్యత్యాసాలు వున్నాయని కాదు, వర్తమాన రీతులలో వ్యవహారసరళి ఒకటిగా రూపొందలేదు గనుక విడిపోయారు. కుముదిని 'మిస్‌బిహేవ్' చేస్తోందని, తనకు 'ఫెయిత్‌ఫుల్'గా లేదనే అనుమానం కలిగింది అతనికి. ఆమె దీనికి అవుననిగానీ, కాదనిగానీ జవాబు చెప్పలేదు. 'నీకు నా పద్ధతి నచ్చకపోతే యేం చేద్దామంటావో చెప్పు! నా ప్రవర్తన గురించి నీకు సంజాయిషీలు యిస్తూ కూర్చోవడం, నిన్ను కన్విన్స్ చేస్తూ పోవటానికి కాలహరణం చేయడం నాకు యెంతమాత్రం యిష్టం లేదు' అంది కుముదిని.

అపుడు 'మనమిద్దరం విడిపోదా' అన్నాడు పరాత్పర రావు వేరే ఆలోచన మనసులలోనికి రానివ్వకుండా.

'సరే అలాగే చేద్దాం -' అంది కుముదిని.

అంతే! అంతకుమించి యేమి అవసరం లేకపోయింది.లీగల్ ఫార్మాలిటీస్ గురించి యిద్దరూ పట్టించుకోలేదు. వాళ్ళది ఎరేంజ్‌డ్ మ్యారేజి కాదు. అలాగని ప్రేమ వివాహమూ కాదు. ఇద్దరికీ చెప్పుకోదగ్గ అయినవాళ్లంటూ యెవరూ యెక్కువగా లేరు. పెళ్లయితే చేసుకున్నారుగాని, దాన్ని 'రిజష్టర్' చేసుకోవడం, గవర్నమెంట్ చట్టాలో దాఖలు అయ్యేట్లుగా చూసుకోవడం గురించి జాగ్రత్తలు తీసుకోలేదు. ఇద్దరూ 'రికామీ' మనుషులే భవిష్యత్తును గురించి బలవంతంగా ఆలోచించాల్సిన అగత్యం వున్నదని యిద్దరూ అనుకోలేదు. అన్నిటికంటే 'సంకల్పం' (మోటివ్) ప్రధానం. కీచులాడుకుంటూ కలసి వుండడం కంటే, విడిపోయి ఎవరి దారి వారు చూసుకుంటే వైభవోపేతంగా వుంటుంది. సాంఘికంగానూ, ఆర్థికంగానూ, సంసారికంగానూ ఒకళ్ల మీద ఒకళ్ళు ఆధారపడి వున్నవాళ్ళు కాదు. కలుసుకోవడం ఎంత తేలికో, విడిపోవడం కూడా అంత తేలికే!

...అలా యాంత్రికంగా జరిగిపోయింది. అయిదేళ్ళు కలిసి వున్న చరిత్ర కాలగర్భంలో కలిసిపోయి, అప్పుడే పదేళ్ళు అయ్యింది. ఈ పదేళ్లు ఒకళ్లు నొకళ్లు, 'ఛేజ్' చేయటానికి గాని, ఆసక్తిగా అనుసరించటానికిగాని ప్రయత్నం చేయలేదు. ఇద్దరూ వేరు వేరు దారుల్లో వెళ్లిపోయారు. ఈ దారులకు 'కూడలి స్థానం' ఒకచోట సందర్భ పడాలనిగాని, పడుతుందిగానీ యిద్దరూ అపేక్షించలేదు.

భోజనం చేసి తన గదికి తిరిగి వెడుతూ 225 మీదుగా నడిచాడు. గది తలుపు 'టాప్' చేదామని ఒక చిలిపి ఆలోచన కూడా కలిగింది. కానీ అది పెద్దమనిషి తరహా కాదని తమాయించుకున్నాడు. కుముదిని ప్రస్తుత 'స్టేటస్' యేమిటో తెలుసుకోకుండా

తన యేమి అడుగు సారించకూడదు. అసలు ఆమెను గురించి- యింతలా యేమి 'అనుకోలేకపోవడం' చేతకాని స్థితి తనకెందుకు తటస్థించిందో అర్థం కాదు! తన పనులన్నీ మానుకుని హోటలు గదిలోనే ఆలోచించుకుంటూ పడుకోవడం అతనికి తప్పనిసరి అయిపోయింది.

ఆ సాయంత్రం అతను ఆలస్యంగా నిద్ర లేచాడు. ఏమాత్రం కలలతో కలుషితం కాకుండా హాయిగా నాలుగు గంటల పాటు యేకటాకిని నిద్రపోవడం ఈ మధ్య కాలంలో జరగలేదు.

గడియారం యేమంటోందోనని చూస్తే 'ఎనిమిదిన్నర చూపిస్తోంది'. హాయిగా స్నానం చేశాడు.

దుస్తులు వేసుకుంటున్నప్పుడు గుర్తు వచ్చింది. ఈ రంగు 'టై' అంటే కుముదినికి యిష్టం అని. అందుకోసం వేసుకోవడం లేదు. అది కేవలం యాదృచ్ఛికంగా చేతికి అందింది-అని తనకు తాను చెప్పుకున్నాడు. అయినా యిప్పుడు ఆమె కనిపిస్తుందని యేమిటి? కనిపించినా తను యేం దుస్తులు వేసుకున్నాడు, యే రంగు 'టై' కట్టుకున్నాడు అని గమనిస్తుందా? తనను గమనించాల్సిన అవసరం ఆమెకు యేముంది?

'221 నెంబరు గదిలో వున్నాను. నీకేం అభ్యంతరం లేకపోతే ఒక్క రెండు నిమిషాలు మాట్లాడతావా?' - అన్న సందేశం ఆమెకు పంపడం ఎలా? 'టెలిపతీ'లో అతనికి నమ్మకం వుంది. కాని ఆమెకూ వుండాలిగా!

ఎందుకు కుముదినితో మాట్లాడాలని తన మనస్సు, శరీరము, బుద్ధి, సమస్త చేతనమూ-కొట్టుకులాడి పోతోందో పరాత్పరరావుకు అర్థం కావడం లేదు.

ఏం మాట్లాడుతాడు?

ఆమె ఎక్కడ వుంటుందీ, ఎలా వుంటుందీ తెలుసుకుంటాడు...అంతే గదా!

ఈ వివరాలన్నీ తనకెందుకు?

పదేళ్ళనాడు లేని ఆసక్తి యిప్పుడు ఎందుకు? అర్థం లేని పని.

జీవితంలో యిదే తమాషా. అర్థంలేని పనులు, అత్యవసరంగా చేయాలనిపించే పనులు, విషాదము-దుఃఖాంతం-యిలాంటివన్నీ వెంట తరుముతూ వుంటాయి. ఒళ్లనుకున్న కోర్కె మనస్సులో - సమస్త చేతనంలో -వ్యాపరించుకుంటాయి. కుదిపివేస్తాయి స్థిరపడిన జీవితాన్ని ఏదో దూరంగా కనిపిస్తున్న దృశ్యం, కొత్తగా ఆకర్షిస్తున్న స్వేచ్ఛా-స్వాతంత్ర్యం కోసం వెతకడం లేదు తను. వెతకవలసిన పని లేకుండానే తను స్వతంత్రుడు. ఇప్పుడు పరతంత్రాన్ని గురించి యెందుకు తీరికే గుంజాటన పడుతున్నాడు? బతుకు ఎలా వుంటే నాకేం అనే నిర్లక్ష్యంతో నిండిపోయిన తనకు, యిప్పుడు పరింగితం తెలుసుకోవాలనే తృష్ణ ఎందుకు ప్రారంభం అయింది? జీవితాన్ని గురించి యితమిత్థంగా యేమీ ఆలోచించలేని వాడికి యిప్పుడు అకస్మాత్తుగా పరస్పర ఆశ్రయం, పరస్పర

అనుబంధశీలత ఎందుకు గుర్తుకు వస్తున్నాయి? వర్తమానంలో బిందువు వెనకటి సారస్యంతా యిపుడు ముందుకు ప్రొజెక్ట్ చేస్తున్నదా?

పరాత్పరరావు తపన వృధా కాలేదు.

మరునాడు మధ్యాహ్నం భోజనాల టైంలో ఆమె డైనింగ్ హాల్‌లో కనిపించింది. ఆమెతోపాటు మరో ఆసామి వున్నాడు. ఆ మనిషిని యిదివరకు ఎప్పుడూ తాను చూచిన గుర్తు లేదు. గుర్తులేకపోవడం కాదు, చూడలేదు! అంతే ఎవరు అతను? అతనేనా?-కుముదిని, తాను కలిసి వున్నప్పుడు కూడా ఆమెను ఆకర్షించిన మనిషి?

అతని మనస్సుకు మరో కొత్త ప్రశ్న వచ్చి కూర్చుంది.

జవాబు దొరికేంతవరకు మనస్సు కోసుకు తింటుంది. తన పూర్తి అస్థిత్వాన్ని - చేతనాన్ని!

అతను సెల్‌ఫోన్‌లో కాల్ రిసీవ్ చేసుకోవటానికి, రహస్యంగా సంభాషణ జరపటానికి బల్ల ముందు నుంచి లేచి వరండాలోకి వెళ్ళాడు.

పరాత్పరరావుకు యిదే మంచి అవకాశం అనిపించింది. ఒకటి రెండు క్షణాలు-అంతకంటే యెక్కువ విరామం లేకపోవచ్చును.

గబగబ ఆమె కూర్చున్న టేబుల్ దగ్గరకు నడిచాడు.

'ఎవరతను?' అనడిగాడు రహస్యంగా.

'ఎవరయితే మీకెందుకు? నిన్నటి నుంచి మీ ఆరాటం చూస్తూ వున్నాను. ఏమిటంత వెంపర్లాట?'

పరాత్పరరావుకు యేం చెప్పాలో తెలియలేదు.

'కాస్త విరామంగా - తీరుబాటుగా - ఎలాంటి యితర జోక్యం లేకుండా - మనం ఓ అరగంట సేపు మాట్లాడుకోవటానికి కుదరదా, కుముదినీ?

'ఏం మాట్లాడతారు? ఎందుకు?'

'అప్పుడు చెబుతాను నా మాట నమ్ము' అన్నాడు యేం మాట్లాడుతున్నాడో తనకే అర్థంకానంత అయోమయంలో చిక్కుకుపోయి.

'రేపు కబురు చేస్తాను లెండి' అంది ఆమె.

మళ్లీ తన బల్ల దగ్గరకు వచ్చి కూర్చుని తాపీగా తయారయాడు పరాత్పరరావు మంచి గంధం పూసుకున్నట్లు అనిపించింది. మరునాడు కుముదినితో యేమేం మాట్లాడాలో మనసులో వాక్యాలు పేర్చుకుంటూ పోతున్నాడు.

◆◆◆

పబ్లిక్ లైబ్రరీలో కలుసుకుంది కుముదిని అతడిని. హోటల్ గది అని ఆశ పడ్డాడు. కాని తీరుబడిగా మాట్లాడు కోవటానికి, ఎవరికీ ఎలాంటి అనుమానాలు రావటానికీ ఆస్కారం లేని చోటు పబ్లిక్ లైబ్రరీ. గట్టిగా మాట్లాడుకొనక్కర్లేదు. వరండాల్లో ఓ చివరి టేబుల్

దగ్గర స్థిరించుకుంటే యెంతసేపయినా సంభాషణ పొడిగించు కోవచ్చు.

కుముదినే ఎక్కువ మాట్లాడింది. అతని కంటె.

తనసంగతులన్నీ చెప్పింది. అతన్ని గురించి అవసరం అయినంతవరకు - మర్యాదకు అతిక్రమణ కానంతవరకు - అడిగి తెలుసుకుంది.

పదేళ్ల తర్వాత కలుసుకున్నందుకు ప్రత్యేకంగా ఆనందంగానీ, ఉత్సాహంగానీ ఎంతమాత్రం కనబడలేదు ఆమెలో. నిత్యజీవితంలో జరిగే అనేకానేక సంఘటనల్లాగ యిది కూడా ఒకటి - అన్నట్లుగా వుంది ధోరణి. పరాత్పరరావు ఉత్సాహం అంతా దాదాపు నీరు కారినట్లు అయిపోయింది. శత్రువుగానే మిగిలిపోవడం అతనికి అంత ఆమోదయోగ్యంగా లేదు.

'ఒక్క విషయం మటుకు చెప్పు కుముదినీ-' అన్నాడు చివరికి.

ఏమిటది అన్నట్లు చూచింది ఆమె.

ఆ కళ్లల్లో తొలకరి మెరుపులు కనిపించాయి అతనికి. అడగటానికి ఒక్క నిమిషం తటపటాయించాడు.

తమాయించుకుని, మళ్లీ ఈ అవకాశం దొరుకుతుందో లేదో అన్న అనుమానం తరుముతూ వుండగా-అనుమానం కాదు, నిజానికి అది నిర్ధారణే! - అడిగాడు.

'మనమిద్దరం కలిసి వున్నప్పుడు...నిన్ను నా నుంచి దూరంగా లాక్కుపోయింది అతనేనా? ఇప్పుడు నీతోపాటు వున్న మనిషేనా? ఆ ఒక్క సంగతీ చెప్పు చాలు..."

'అవును - అతనే ఇతను -' అంది కుముదిని. ఆమె ముఖంలో యెలాంటి వికారాలు లేవు. అతి సాదా సీదాగా వుంది ఆమె వాలకం.

పరాత్పరరావు కుంగిపోయాడు. ఎందుకు యింత నిరుత్సాహం అతన్ని కైవశం చేసుకున్నదో అతనికే తెలియదు. నిజానికి అతనే యితను అయితేనేం, కాకపోతేనేం? - అప్పుడు లేని విచికిత్స యిప్పుడెందుకు కావలసి వచ్చింది?

కుముదిని యింక వెళ్ళిపోవటానికి అయత్తం అవుతూ వుండగా అన్నాడు పరాత్పరరావు.

'మనం కలిసివున్న చివరి సంవత్సరం - దాదాపు ఒక సంవత్సరం పాటు అనుకుంటాను...అతను నీకు ప్రియుడుగా వున్నాడు. నాకు తెలియకుండా నన్ను మోసం చేశావు. అందుకు యిప్పుడు నిన్న నేను నిందించడం లేదు... నాకేం సంబంధం లేనట్లుగానే వుండిపోయాను...కాని యిప్పుడు నేనే ఓ వింత షరతు విధిస్తున్నాను...'

కుముదిని ఆశ్చర్యంగా అతనివంక చూచింది. ఇది ఆమె ఎదురు చూడని సందర్భం అని ఆ ముఖం చెప్పక చెబుతోంది.

పరాత్పరరావు ఆమె నుంచి యే మాటలు ఆశించకుండా ఏకబిగిని అనేశాడు.

'నాతో వున్నప్పుడు అతన్ని ప్రియుడుగా స్వీకరించావు. సంవత్సరంపాటు కాలం

గడిచి తరువాత అతన్నే పెళ్ళి చేసుకున్నావు. ఇప్పుడు నాకు...నేను యేమీ ప్రయత్నం చేయకుండానే నాకు కనిపించావు గనుక, నన్ను ప్రియుడిగా స్వీకరించు. అందుకు నీకు అభ్యంతరం వుండాల్సిన అవసరం లేదు నిజానికి. కాని... అభ్యంతరం చెప్పావో, నన్ను కాదన్నావో నిన్ను గురించిన యదార్థం అంతా అతనికి చెప్పేస్తాను. మీ స్నేహం...సంసారమూ...నాకయితే తెలియదు, విచ్ఛిన్నం అయిపోయేంత వరకూ నిద్రపోను, నీ యిష్టం...'

'అదా సంగతి...' అంది కుముదిని.

'చాల అసంగతం అని నాకు తెలుసు. అయినా యిదే నా షరతు. రేపు యీ టైముకు యిక్కడికే వస్తాను. నీవేం తేల్చుకుంటావో నీ యిష్టం...' అని పరాత్పరరావు యింక ఆమె ముఖం చూడడం కూడా యిష్టం లేనివాడి మాదిరిగా లైబ్రరీ నుంచి గబగబ అడుగులు వేసుకుంటూ రోడ్డు మీదకి చేరాడు. రెండు రోజులుగా తాను వాయిదా వేస్తూ వస్తున్న అనేక పనులు 'ఎటెండ్' అవడం కోసం ఆతురతగా పరుగులు తీశాడు

◆◆◆

ఆ రాత్రి అకస్మాత్తుగా రెండు గంటలకు మెలుకువ వచ్చింది అతనికి.

ఆ రోజంతా చేసిన పనులు నెమరుకు తెచ్చుకుని సమీక్షించుకున్నాడు.

పరాత్పరరావుకు తన మీద తనకే అసహ్యం వేసింది. 'ఏమిటీ నేను చేసిన పని? అయిదేళ్లపాటు ఈ మనిషితో సంసారం చేశాను ఇంకా నా మోహం తీరలేదా? ఇప్పుడు మళ్లీ యెందుకు దొంగచాటు వ్యవహారాలు కావాలను కుంటున్నాను? - ఛీ, నిజంగానే నాకు బుద్ధిలేదు' - అనుకున్నాడు పరాత్పరరావు. 'ఆమె పరాయి మనిషి అయిపోయింది గనుకనా యింత ఆపేక్ష? ఆ రోజు చేయవలసిన పని... యిప్పుడు యాభయి యేళ్ళు పైబడ్డ తరువాత - చేయాలనుకోవడం, నిజంగానే నాకు బుద్ధి లేదని నిరూపిస్తోంది... కుముదిని యేమనుకుంటే నాకేం? నాకు మాత్రం గగన గంగ అవసరం లేదు...' అని మళ్లీ నిద్రకు పడ్డాడు.

తెలుగు పలుకు-తానా రజతోత్సవ సంచిక

◆